అబిడ్స్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో కంచనపల్లి గోవర్ధనరాజు రచించిన బలమూరి కొండలరాయుడు గేయ కావ్యాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ కవిత

పాలనాలోపాలను కవులు ఎత్తిచూపాలి

- తెలంగాణ గడ్డలోనే ధిక్కారం.. అంతే స్థాయిలో ప్రేమ ఉంటది
- యువ కవుల రచనలతో తెలంగాణ సాహిత్యం వందల ఏండ్లు సజీవం
- యువ కెరటాలు కవి సమ్మేళనంలో జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్, జూన్ 2 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ పాలనలోని లోపాలను కవులు, సాహితీవేత్తలు ఎప్పటికప్పుడు ఎత్తిచూపాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సూచించారు. కవులు ఏ పాలకుడి ముందు కూడా తలవంచకూడదని అభిలషించారు. తెలంగాణగడ్డలోనే ధిక్కారం ఉన్నదని, అదే స్థాయిలో ప్రేమ కూడా ఉంటదని చెప్పారు. ఎలాంటి పరిస్థితుల్లోనైనా నిజాన్ని నిర్భయంగా చెప్పేవాడే కవి అని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అబిడ్స్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో సోమవారం తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో నిర్వహించిన యువ కెరటాలు కవి సమ్మేళనంలో ఆమె మాట్లాడారు. యువ కవుల రచనలతో తెలంగాణ సాహిత్యం వందల ఏండ్లు వర్ధిల్లుతుందని, అందుకే యువ కవి సమ్మేళనం అన్ని భాషల్లో నిర్వహించామని తెలిపారు. 35 ఏండ్లలోపు కవులు ఈ సమ్మేళనంలో పాల్గొని కవితాగానం చేశారని పేర్కొన్నారు.

దిక్సూచి, దారిదీపంలా కేసీఆర్

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ దిక్సూచిలా, దారిదీపంలా నిలబడి ఉద్యమ దిశానిర్దేశం చేశారని, ఆయన సాగించిన పోరాటాలు, వందలాది మంది త్యాగాలతో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్న రోజు ఈరోజు అని ఎమ్మెల్సీ కవిత చెప్పారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం సాగించిన పోరాటం, అమరుల త్యాగాలు, ఈ ప్రాంతం ఉమ్మడి రాష్ట్రంలో దగా పడిన వైనాన్ని కవులు, సాహితీవేత్తలు అద్భుతంగా చెప్పారని గుర్తుచేశారు. రేపటి తెలంగాణ అభివృద్ధి, వికాసం కోసం సాహిత్య సృజన కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ వనరులను పరిరక్షించుకోవాలన్నా, నీళ్లు, నిధులు, హక్కులు కాపాడుకోవాలన్నా అందుకు కవులు, సాహితీవేత్తల సహకారం అవసరమని తెలిపారు. ఈ అంశాలపై తెలంగాణ జాగృతి చేపట్టబోయే కార్యక్రమాలకు చేయూతనందించాలని కోరారు.

పథకాలకు ఉద్యమకారుల పేరు పెట్టాలి

యువ వికాసం పథకానికి తెలంగాణతో సంబంధం లేని రాజీవ్‌గాంధీ పేరు కాకుండా తెలంగాణ ఉద్యమకారుల పేరు పెట్టాలని తెలంగాణ జాగృతి డిమాండ్ చేసిందని కవిత గుర్తుచేశారు. యువ వికాసం అర్హుల ఎంపికలో లోపాలున్నాయని ప్రారంభ కార్యక్రమాన్ని వాయిదా వేసుకున్న ప్రభుత్వం.. పథకానికి తెలంగాణ ఉద్యమకారుల పేరు పెట్టేందుకు మాత్రం సిద్ధంగా ఉన్నట్టు కనిపించడం లేదని విమర్శించారు. తెలంగాణ తల్లి విగ్రహ రూపశిల్పి బీవీఆర్ చారి పుట్టిన రోజు, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం ఒకే రోజు కావడం సంతోషకరమని తెలిపారు. ఈ సందర్భంగా కంచనపల్లి గోవర్ధనరాజు రచించిన బలమూరి కొండలరాయుడు గేయ కావ్యాన్ని కవిత ఆవిష్కరించారు. తెలంగాణ సారస్వత పరిషత్ పురస్కారాన్ని పొందినందుకు ఆయనను అభినందించారు.

జై తెలంగాణ అనని సీఎం రేవంత్‌రెడ్డి

సుదీర్ఘ పోరాటం, వందలాది మంది బలిదానాలు, త్యాగాలతో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జై తెలంగాణ అని నినదించలేదని ఎమ్మెల్సీ కవిత మండిపడ్డారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం బంజారాహిల్స్‌లోని తెలంగాణ జాగృతి నూతన కార్యాలయంలో ఆమె జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేసీఆర్ దృఢ సంకల్పం, దూరదృష్టితోనే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సాధ్యమైందని పునరుద్ఘాటించారు. తెలంగాణ కోసం ప్రాణ త్యాగాలు చేసిన అమరవీరులకు కనీసం సరైన నివాళులు కూడా అర్పించని ప్రభుత్వం ప్రస్తుతం ఉండటం దురదృష్టకరమని విమర్శించారు.

అటకెక్కిన బీసీ రిజర్వేషన్ బిల్లు?

- అసెంబ్లీలో ఆమోదించి... చేతులు దులుపుకొన్న సర్కార్
- గవర్నర్ ఆమోదం కోసం చొరవ తీసుకోని ప్రభుత్వ పెద్దలు
- కులగణనపై రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారం లేదన్న కేంద్రం
- రిజర్వేషన్ బిల్లు ఆమోదంపై బీసీల్లో అంతటా అనుమానం
- జూలై నెలాఖరున స్థానిక ఎన్నికలంటూ సర్కారు హడావుడి

హైదరాబాద్, జూన్ 2 (నమస్తే తెలంగాణ): విద్యా, ఉపాధి, ఉద్యోగం, రాజకీయ రంగాల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన బిల్లు ఎక్కడుందనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. మార్చిలో నిర్వహించిన అసెంబ్లీ సమావేశాల్లో బీసీ రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టి ప్రభుత్వం ఆమోదించింది. బిల్లును గవర్నర్‌కు పంపి చేతులు దులుపుకుందని బీసీ సంఘాల నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు. అసెంబ్లీలో బిల్లును ఆమోదించిన వెంటనే ఢిల్లీ వెళ్లి హడావుడి చేసిన ప్రభుత్వ పెద్దలు.. ఇప్పటికీ 2 నెలలు గడిచినా గవర్నర్ ఆమోదానికి చొరవ చూపకవడమేంటని మండిపడుతున్నారు. కాంగ్రెస్ సర్కారు చిత్తశుద్ధి లేకుండా వ్యవహరిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఢిల్లీలో హడావుడి.. తెలంగాణలో గప్‌చుప్

“అధికారంలోకి వచ్చిన 6 నెలల్లోపే కులగణన నిర్వహిస్తాం. కమిషన్ నివేదిక ఆధారంగా స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్లను 23శాతం నుంచి 42శాతానికి పెంచి 23,973మంది బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పిస్తాం. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల ఉపవర్గీకరణ అమలు చేస్తాం.'' అని కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించింది. కానీ అశాస్త్రీయ పద్ధతిలో కులగణనను నిర్వహించిందని బీసీ సంఘాలు మండిపడుతున్నారు. ఆ తర్వాత బీసీలకు విద్యా, ఉద్యోగ ఉపాధి అవకాశాలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ మార్చి 17న శాసనసభ సమావేశాల్లో బిల్లులను ప్రవేశపెట్టగా, బీఆర్ఎస్ సహా అన్ని పార్టీలు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపాయి. అనంతరం ప్రభుత్వం ఆ బిల్లులను గవర్నర్ ఆమోదానికి పంపింది. బిల్లులను అసెంబ్లీ ఆమోదించిన వెంటనే ఢిల్లీ వెళ్లి ప్రభుత్వ పెద్దలు దేశానికే ఆదర్శంగా నిలిచామని గొప్పగా చెప్పుకున్నారు. బిల్లులను గవర్నర్ ఆమోదించేందుకు కోసం కాంగ్రెస్ సర్కారు, ప్రభుత్వ పెద్దలెవరూ ఎలాంటి చురుకైన ప్రయత్నాలు చేపట్టకపోవడం చర్చనీయాంశంగా మారింది. రెండునెలలుగా పెండింగ్‌లో ఉన్నా కూడా ఆ ఊసెత్తని పరిస్థితి. బిల్లులను అటకెక్కించే ఉద్దేశమే తప్ప మరేమీ లేదని బీసీ సంఘాల ప్రతినిధులు మండిపడుతున్నారు.



ఆమోదానికి సర్కారు ప్రయత్నమేది..?

శాసనసభ ఆమోదించిన తర్వాత బిల్లులను తక్షణమే గవర్నర్ ఆమోదం కోసం పూర్తి సమాచారంతో పంపాల్సి ఉందని నిపుణులు చెప్తున్నారు. గవర్నర్‌తో సంప్రదింపులు, తగిన నిబంధనల రూపకల్పన వంటి కీలక ప్రక్రియలు ప్రభుత్వం చేపట్టాలని అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు. గతంలో బీహార్‌లో నితీశ్‌కుమార్ నేతృత్వంలోని ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను పెంచే బిల్లులను అసెంబ్లీలో ఆమోదించి, తక్షణమే గవర్నర్‌కు పంపి ఆమోదం పొందింది. కానీ తెలంగాణలో మాత్రం బిల్లులను గవర్నర్ తిరస్కరించినట్టుగానీ, ఇతర సమాచారం కావాలని అడిగినట్టుగానీ రాజ్‌భవన్ నుంచి ఎలాంటి ప్రకటన రాలేదు. ప్రభుత్వం గవర్నర్‌తో ప్రత్యక్షంగా ప్రభుత్వం చర్చించిన దాఖలాలు లేదు. దానికి ప్రధాన కారణం కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యమేనని కులసంఘాల ప్రతినిధులు వివరిస్తున్నారు. గవర్నర్ నమ్మదగిన, చట్టబద్ధమైన ఆధారాలతో ఒప్పించాల్సిన ప్రయత్నమే రేవంత్‌సర్కార్ చేపట్టడం లేదని విమర్శిస్తున్నారు.

బిల్లులు అటకెక్కినట్టేనా?

గవర్నర్ వద్ద బిల్లులు పెండింగ్‌లో ఉండడం, కాంగ్రెస్ సర్కారు పట్టించుకోకపోవడం, కులగణన చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు లేదంటూ కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. దీంతో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన కులగణన సర్వే గణాంకాలకు ప్రామాణికత లేకుండా పోయింది. మరోవైపు ఆ గణాంకాల ఆధారంగా కల్పించిన రిజర్వేషన్లు చెల్లని పరిస్థితి ఏర్పడిందని బీసీ సంఘాల నేతలు మండిపడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తూతూమంత్రంగా అసెంబ్లీలో ఆమోదించిన బిల్లులు అటకెక్కినట్టేనని నిప్పులు చెరుగుతున్నారు.

మెదక్ జిల్లా వెల్దుర్తి మండలంలోని హస్తాల్‌పూర్‌లో జాతీయ జెండా ఆవిష్కరణను అడ్డుకొని ఖాళీ బిందెలతో పంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

తాగునీటి గోస తీర్చాలి

- రాష్ట్రావతరణ దినోత్సవాన్ని అడ్డుకున్న గ్రామస్థులు

వెల్దుర్తి, జూన్ 2: నాలుగైదు రోజుల నుంచి తాగునీరు లేక గోస పడుతున్నా పట్టించుకోవడం లేదంటూ మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం హస్తాల్‌పూర్ గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ రాష్ట్రావతరణ వేడుకలను అడ్డుకున్నారు. గ్రామానికి మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో హల్దీవాగు నుంచి మోటార్ ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. కొన్ని రోజుల క్రితం బోరు చెడిపోయింది. పంచాయతీలో నిధులు లేకపోవడంతో మరమ్మతులు చేయించలేదు. నాలుగైదు రోజుల నుంచి తాగునీరు సరఫరా కాకపోవడంతో గ్రామస్థులు వ్యవసాయ బోరు బావుల నుంచి నీటిని తెచ్చుకుంటున్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవ వేళ సోమవారం జాతీయ జెండాను ఎగురవేయడానికి వచ్చిన పంచాయతీ కార్యదర్శి శివశంకర్‌ను అడ్డుకొని తాగునీటి సమస్య పరిష్కరించిన తరువాతే జెండాను ఎగురవేయాలని డిమాండ్ చేశారు. సాయంత్రం వరకు తాగునీటిని పునరుద్ధరిస్తామని చెప్పడంతో ఆందోళనను విరమించగా కార్యదర్శి జెండాను ఎగురవేశారు.

మ్యాప్‌లో తప్పులపై చర్యలు..!

- నాడు భారత్ సమ్మిట్‌లో మ్యాప్ ప్రచురించిన రాష్ట్ర ప్రభుత్వం

హైదరాబాద్, జూన్ 2(నమస్తే తెలంగాణ): భారత్ సమ్మిట్‌లో రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం భారతదేశ చిత్రపటాన్ని తప్పుగా ప్రచురించడంపై సర్వే ఆఫ్ ఇండియా చర్యలకు ఉపక్రమించింది. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని రెసిడెంట్ గ్రీవియన్స్ అధికారి వినయ్ ప్రకాశ్‌ను ఆదేశించింది. తెలంగాణ కాంగ్రెస్ అధికారిక ట్విటర్ ఖాతాలో పోస్ట్ చేసిన చిత్రపటంపై విచారణ జరిపించామని, చిత్రపటంలో తప్పులున్నట్టు నిర్ధారించినట్టు పేర్కొన్నది. రాష్ట్ర కాంగ్రెస్ సర్కారు ఏప్రిల్ 25, 26 తేదీల్లో హైదరాబాద్‌లో భారత్ సమ్మిట్‌లో ప్రదర్శించిన దేశ చిత్రపటంలో ఈ మూడు కీలక తప్పులు దొర్లాయి. దీనిపై న్యాయవాది కారుపోతుల కేంద్ర హోంశాఖకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు హోంశాఖ విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని సర్వే ఆఫ్ ఇండియాకు ఆదేశించింది.

- **స్పిరిట్ ఆఫ్ హైదరాబాద్ పోస్టర్ ఆవిష్కరణ**

‘స్పిరిట్ ఆఫ్ హైదరాబాద్’ పేరిట ఆగస్టు 10న నిర్వహించనున్న శాలివాక్ పోస్టర్‌ను నేత కార్మిక సంఘాల నాయకులతో కలిసి బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర సోమవారం తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేత కార్మికుల అభ్యున్నతికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నేత కార్మిక సంఘాల ప్రతినిధులు మద్దూరి నాగలక్ష్మి, పుష్పలత, శెట్టిపల్లి ఉదయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయ గోశాలలో మూడు కోడెలు మృతి

- ఆరు కోడెల పరిస్థితి విషమం
- జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి రవీందర్‌రెడ్డి

వేములవాడ టౌన్, జూన్ 2: రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శివారులోని తిప్పాపురం గోశాలలో అనారోగ్యంతో బాధపడుతున్న మూడు కోడెలు మృతిచెందాయని, మరో ఆరు కోడెల పరిస్థితి విషమంగా ఉందని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి రవీందర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనారోగ్య పరిస్థితుల కారణంగా గోశాలలో మొదట 8కోడెలు మృతిచెందాయన్నారు. ఐదుగురు వెటర్నరీ డాక్టర్లతో కూడిన 12 మంది వైద్య బృందం కోడెలను పర్యవేక్షిస్తున్నట్టు చెప్పారు. అనారోగ్యం పాలైన 20 కోడెలకు ప్రత్యేకంగా చికిత్స అందించి 16 కోడెలను కాపాడామని, రెండో రోజు మరో 4 కోడెలు మృతిచెందాయని తెలిపారు.

ఇందిరమ్మ ఇల్లు రాలేదని తీవ్ర మనస్తాపం

- ఒంటిపై పెట్రోల్ పోసుకుని గిరిజనుడి ఆత్మహత్యాయత్నం
- ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం మంగాపురంతండాలో ఘటన

కూసుమంచి (నేలకొండపల్లి), జూన్ 2 : ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో తన పేరులేకపోవడంతో తీవ్ర మనస్తాపం చెందిన ఓ గిరిజనుడు ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం మంగాపురం తండాలో చోటుచేసుకున్నది. తండాకు చెందిన ధరావత్ కేశ్యా కూలి పనులు చేసుకుంటూ భార్య, ముగ్గురు పిల్లలను పోషించుకుంటున్నాడు. రేకులషెడ్‌లో నివసిస్తున్న అతడు ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకొని జాబితాలో పేరు వస్తుందని ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నాడు. ఈ క్రమంలో అధికారులు సోమవారం ప్రకటించిన జాబితాలో తన పేరు లేకపోవడంతో తీవ్ర మనస్తాపం చెందిన కేశ్యా.. ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా పక్కనే ఉన్నవారు, అధికారులు కలుగజేసుకొని నచ్చజెప్పారు. అన్ని అర్హతలున్నా ఇండ్ల జాబితాలో పేరు లేకపోవడం ఏమిటని, ఆస్తులు బంగ్లాలు ఉన్న వారికే ఇండ్లు మంజూరు చేస్తారా? మా లాంటి నిరుపేదలు మీకు కనిపించరా? అంటూ అధికారులను ప్రశ్నించాడు. రేకుల షెడ్డును చూసైనా ఇల్లు మంజూరు చేయాలని వేడుకున్నాడు.

ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం మంగాపురంతండాలో పెట్రోల్ డబ్బాతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన కేశ్యా

అర్హుల జాబితా నుంచి తన పేరును తొలగించారని.. ఇల్లు కేటాయించాలంటూ కడియం కాళ్లు మొక్కుతున్న గుగ్గిళ్ల ఎల్లమ్మ

తనకు ఇందిరమ్మ ఇల్లు కేటాయించాలంటూ కడియంకు మొక్కుతున్న పుంజారి రజిత

కాళ్లపై పడినా.. కనికరించని కడియం

- ‘ఇందిరమ్మ’లో పేరు తొలగింపు
- కన్నీళ్లు పెట్టుకుని కడియం శ్రీహరిని వేడుకున్న ఎల్లమ్మ
- బలవంతంగా లాక్కెళ్లిన పోలీసులు

స్టేషన్ ఘన్‌పూర్, జూన్ 2 : తన పేరును అర్హుల జాబితా నుంచి తొలగించారని, ఇందిరమ్మ ఇల్లు ఇప్పించి ఆదుకోవాలంటూ ఓ మహిళ కన్నీరు కారుస్తూ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కాళ్లపై పడినా పట్టించుకోని ఘటన తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ సాక్షిగా జనగామ జిల్లాలో చోటుచేసుకుంది. సోమవారం జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం శివునిపల్లిలో రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా మండలంలోని లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్స్ పంపిణీ కార్యక్రమం ఆర్డీవో డీఎస్ వెంకన్న ఆధ్వర్యంలో నిర్వహించగా, ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి హాజరయ్యారు. కొత్తపల్లికి చెందిన గుగ్గిళ్ల ఎల్లమ్మకు ఇందిరమ్మ ఇండ్ల లిస్టులో పేరు రాగా, ముగ్గు పోసుకోవడానికి అంతా సిద్ధం చేసుకుంది. ప్రొసీడింగ్స్ ఇచ్చే సమయానికి తమ పేరును అర్హుల జాబితా నుంచి తొలగించారని, తమకు ఇల్లు ఇప్పించి ఆదుకోవాలంటూ కన్నీరు కారుస్తూ స్టేజీపై కడియం కాళ్లపై పడింది. మరొక వైపు ఇండ్లు, భూములు లేని నిరుపేదలకు ఇండ్లు కేటాయించాలంటూ సమావేశం మధ్యలో పుంజారి రజిత, నాగరాజు దంపతులు ఫ్లెక్సీ పట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. తమకు ఇల్లు కేటాయించకుండా అనర్హులకు ఇల్లు కేటాయించారని, నాయకుల చుట్టూ ఎన్నిమార్లు తిరిగినా ఇళ్ల జాబితాలో పేరు రాలేదని కడియంకు చేతులెత్తి మొక్కారు. దీంతో పోలీసులు బలవంతంగా అక్కడ నుంచి తీసుకపోయే ప్రయత్నంచేశారు. అధికారులు విచారణ చేపట్టి లబ్ధిదారులను ఎంపిక చేశారని, రెండో విడతలో మళ్లీ వస్తాయని కడియం నచ్చజెప్పారు.

ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం పేరుపల్లిలో అంబేద్కర్ విగ్రహం వద్ద మోకాళ్లపై కూర్చొని నిరసన వ్యక్తం చేస్తున్న నిరుపేదలు, దరఖాస్తుదారులు

ఇండ్ల కోసం మోకాళ్లపై కూర్చొని నిరసన

- ఎంపికలో అన్యాయం జరిగిందని నిరుపేదల ఆరోపణ
- ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసేవరకూ పోరాడుతామని హెచ్చరిక

కారేపల్లి, జూన్ 2: అర్హులను పక్కనపెట్టి పక్కా భవనాలు, వ్యవసాయ భూములు, ఆస్తులు ఉన్న వారికి ఇండ్ల జాబితాలో చోటు కల్పించడంపై ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం పేరుపల్లికి చెందిన నిరుపేదలు, దరఖాస్తుదారులు అంబేద్కర్ విగ్రహం ఎదుట మోకాళ్లపై కూర్చొని సోమవారం నిరసన వ్యక్తంచేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేరుపల్లి పంచాయతీ పరిధిలో అధికారపార్టీకి అనుకూలంగా ఉన్న, సంపన్న కుటుంబాలకు ఇందిరమ్మ కమిటీలు ఇండ్ల జాబితాలో చోటు కల్పించారని ఆరోపించారు. ఉన్నతాధికారులు జాబితాను పరిశీలించి నిరుపేదలు, గుడిసెలు, రేకుల షెడ్లలో నివాసం ఉంటున్న వారికి ఇండ్లు మంజూరయ్యేలా చూడాలని కోరారు. నిబంధనలకు అనుగుణంగా ఇండ్లు మంజూరు చేయని పక్షంలో మండలపరిషత్ కార్యాలయం ఎదుట ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

సస్పెండ్ చేస్తే.. అందరి జాతకాలు బయటపెడ్తా..

- బీజేపీ రాష్ట్ర నాయకత్వానికి ఎమ్మెల్యే రాజాసింగ్ వార్నింగ్

హైదరాబాద్, జూన్ 2 (నమస్తే తెలంగాణ): తనను సస్పెండ్ చేస్తే అందరి జాతకాలు బయటపెడతానని బీజేపీ గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ రాష్ట్ర నాయకత్వానికి స్ట్రాంగ్ వార్నింగ్ ఇవ్వడం సంచలనంగా మారింది. ఈ మేరకు సోమవారం రాజాసింగ్ ఓ ప్రకటన విడుదల చేశారు. తనకు పార్టీ నోటీసులు ఇవ్వాలని యోచిస్తున్నట్టు ప్రచారం సాగుతున్నదని.. నోటీసులు కాదు.. కావాలంటే పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని రాజాసింగ్ డిమాండ్ చేశారు. ఎవరి వల్ల పార్టీకి నష్టం జరిగిందనేది ప్రజల ముందుంచి తాను బయటకు వెళ్తానని.. సొంత పార్టీ నేతలను ఆయన హెచ్చరించారు. బీజేపీలో రాష్ట్ర నాయకత్వం వర్సెస్ రాజాసింగ్ వివాదం మరింత ముదురుతున్న వేళ.. ఆయన తాజా ప్రకటన కాషాయపార్టీలో మరోసారి కలకలం రేపింది.

లండన్‌కి వస్తా.. హుక్‌మీ అప్!

మొదటిపేజీ తరువాయి...

జరిగిన ‘మిస్ వరల్డ్-2025’ పోటీల్లో మ్యాగీకి ఎదురైన అనుభవాలను 200 ఏండ్లకుపైగా చరిత్ర కలిగి, బ్రిటన్‌లోనే ప్రఖ్యాత డైలీగా పేరొందిన ‘ది గార్డియన్’ పత్రిక కూడా తాజాగా ప్రచురించింది. ఆ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మ్యాగీ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సంచలనంగా మారాయి.

అసౌకర్యానికి గురయ్యా

‘ది గార్డియన్’కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మ్యాగీ మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో జరిగిన మిస్ వరల్డ్ పోటీలకు తాము ఎందుకు వచ్చామోనన్న విషయాన్ని చెప్పనీయకుండా, అతిథులను అలరించడానికే అన్నట్టు తమను గ్లామర్ బొమ్మలుగా వాడుకొన్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఓ గుర్తుతెలియని వ్యక్తి తన దగ్గరికి వచ్చి అసంబంద్ధంగా ప్రవర్తించిన తీరును కూడా ఆమె వివరించారు. ‘ఈవెంట్ జరుగుతున్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తి నా దగ్గరకు వచ్చాడు. నెక్స్ట్ టైమ్ తాను లండన్ లేదా ఇంగ్లండ్‌కు రానున్నట్టు చెప్పాడు. అక్కడ ఇద్దరం కలిసి ఏకాంతంగా గడుపుదాం (హుక్‌మీ అప్) అంటూ చెప్తూ అక్కడి నుంచి ఉడాయించాడు. అతని వ్యాఖ్యలతో నేను ఎంతో అసౌకర్యానికి గురయ్యా. అతనెవరో కూడా నేను సరిగ్గా చూడలేదు’ అంటూ మ్యాగీ ఆవేదన వ్యక్తంచేశారు. పోటీల్లో తనకు ఎదురైన అనుభవాలను ధైర్యంగా చెప్పినందుకు కొందరు సోషల్‌మీడియాలో తనను తప్పుబట్టారన్న మ్యాగీ.. ఈ విషయంలో తానేమీ బాధపడటం లేదని చెప్పారు. తన విలువలను తాను కాపాడుకోవడం తనకు ఎంతో ముఖ్యమని ఉద్ఘాటించారు.

నవ్వుల వెనుక కన్నీళ్లెన్నో..

‘పోటీలో గెలవలేనన్న కారణంతోనే మ్యాగీ వెళ్లిపోయింది’ అంటూ మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్ సీఈవో, చైర్‌పర్సన్ జూలీ మోర్లే చేసిన వ్యాఖ్యలు తనపై ప్రతీకారపూరితంగా ఉన్నాయని మ్యాగీ ధ్వజమెత్తారు. మోర్లే వాదన అసంబద్ధమైనదని కొట్టిపారేశారు. మోర్లే చెప్పినవన్నీ అబద్ధాలేనని పునరుద్ఘాటించారు. ‘నేను ఏదైతే నమ్ముతానో, ఏ విలువలైతే నాకు ఉన్నాయో.. అలాంటి వాటికి కట్టుబడి ఉన్నాను. అందుకే, అలాంటి వాతావరణంలో ఉండలేక నేను వెనుదిరిగి వచ్చాను’ అంటూ మ్యాగీ తేల్చి చెప్పారు. సీపీఆర్ క్యాంపెయిన్‌కు సాయపడుతుందన్న ఉద్దేశంతోనే తాను పోటీల్లో పాల్గొనడానికి సిద్ధపడ్డానని, అయితే, హైదరాబాద్‌కు వచ్చాక వాస్తవానికి భిన్నమైన పరిస్థితులను చవిచూశానని వాపోయారు. పురుషుల ముందు పరేడ్ చేయలేక, డబ్బు ఉన్నవారిని సంతోషపెట్టే వస్తువుగా ఉండలేకనే వెనుదిరిగి వచ్చానని మరోసారి స్పష్టంచేశారు. ‘హైదరాబాద్‌లో జరిగిన మిస్ వరల్డ్ ఈవెంట్‌లో పైకి కనిపించిన నవ్వుల వెనుక ఎన్నో కన్నీళ్లు ఉన్నాయి. అబద్ధాలు చెప్పి నేను అక్కడ ఉండాలని అనుకోలేదు’ అని మ్యాగీ కన్నీటిపర్యంతమయ్యారు.

నేనొక్కదాన్నే కాదు

హైదరాబాద్ ఈవెంట్‌లో తాను ఒక్కదాన్నే ఇలాంటి వేధింపులకు గురికాలేదని మ్యాగీ తెలిపారు. తాను ఎదుర్కొన్న అనుభవాలనే మిగతా పోటీదారులు కూడా ఎదుర్కొన్నారని, ఇదే విషయమై వారు తనకు వందల మెసేజ్‌లు పంపించారని తెలిపారు. తాను ఎదుర్కొన్న ఇబ్బందులను పరిగణనలోకి తీసుకొని.. అలా జరుగకుండా ఉండేందుకు అవసరమైన చర్యలను మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్ చేపట్టాలి. అయితే, అలా చేయాల్సింది పోయి.. తనపై అసంబద్ధ వ్యాఖ్యలతో ఎదురుదాడికి దిగడం ఏమిటని ఆమె ప్రశ్నించారు.

మళ్లీ ఇంటర్వ్యూ ఎందుకు?

హైదరాబాద్‌లో జరిగిన మిస్ వరల్డ్ 2025 పోటీల సందర్భంగా తాను ఎదుర్కొన్న వేధింపులను మిస్ ఇంగ్లండ్ మిల్లా మ్యాగీ ‘ది సన్’ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు. నిర్వాహకుల తీరుతో ‘తాను ఏమైనా వేశ్యనా ఏంటి?’ అనే భావన తనకు కలిగిందని ఆవేదన వ్యక్తంచేశారు. మనసు చంపుకొని ఉండలేకనే పోటీల మధ్య నుంచి వైదొలిగినట్టు తెలిపారు. మ్యాగీ వ్యాఖ్యలను ఖండించిన మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్ సీఈవో, చైర్‌పర్సన్ జూలీ మోర్లే.. ‘ది హిందూ’ పత్రికతో వారం కిందట మాట్లాడారు. ‘పోటీలో చివరివరకూ నిలబడతానన్న నమ్మకం లేకనే మ్యాగీ మధ్యలో వెళ్లిపోయిందం’టూ మోర్లే వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై స్పందించాలంటూ ‘ది గార్డియన్’ పత్రికకు చెందిన సీనియర్ జర్నలిస్ట్ కేవిన్ రాలిన్సన్ మ్యాగీని కోరారు. దీంతో తనకు ఎదురైన అనుభవాలను మ్యాగీ గార్డియన్ పత్రికతో శనివారం పంచుకొన్నారు.

మిస్ వరల్డ్-72విజేత సుచాతకు బహుమతి అందజేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

ఇక్కడి అనుభవాలు గుర్తుండిపోతాయి!

- మిస్ వరల్డ్ విజేతలకు రాజ్‌భవన్‌లో తేనీటి విందు
- హాజరైన గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, జూన్ 2 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లో నిర్వహించిన మిస్ వరల్డ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ రాజ్‌భవన్‌లో తేనీటి విందు ఇచ్చారు. థాయిలాండ్‌కు చెందిన మిస్ వరల్డ్-72 విజేత ఓపల్ సుచాతా చువాంగ్‌శ్రీ, మొదటి రన్నరప్ హస్సెట్ దేరేజే(ఇథియోపియా), రెండో రన్నరప్ మజ క్లాజ్డా(పోలాండ్), మూడో రన్నరప్ ఆరెల్లా జో అచ్చిమ్(మార్టినిక్) పాల్గొన్నారు. వీరిని గవర్నర్, సీఎంలు సన్మానించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ పోటీల సందర్భంగా ఇక్కడ జరిగిన అనుభవాలు గుర్తుండిపోతాయని అందగత్తెలను ఉద్దేశించి అన్నారు. కాగా, అంతకుముందు రాజ్‌భవన్‌లో ఆకులతో గిరిజనులు రూపొందించిన స్వాగత వేదిక వద్ద మిస్ వరల్డ్ విజేతలు ఫొటోలు దిగారు. రాజ్‌భవన్ తేనేటి విందుకు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, సీఎస్ రామకృష్ణారావు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.